దూడూ బసవన్నల సందడి

- సంక్రాంతి పండుగపైనే ఆశ
- పొట్టతిప్పలకోసం గంగిరెద్దులతో విన్యాసాలు
- ఆదరణ కరువు


గంగిరెద్దుతో బిక్షాటన చేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: సంక్రాంతి పండగ వస్తుందంటే పల్లె, పట్టణ ప్రాంతాల్లో వారంరోజులు ముందు నుంచే డూడూ బసవన్నలు సందడి చేస్తాయి. ఈ పండగ గంగిరెద్దులను ఆడించే వారిజీవితాల్లో కొంత కాంతిని నింపుతుంది. కానీ ప్రస్తుతం గంగిరెద్దులకు ఆదరణ కరువైంది. వేకువజామున చలిలో గంగిరెద్దులతో ఊరూరా, ఇంటింటా తిరుగుతూ ప్రదర్శనలు ఇస్తారు. ఇలా పండగ పూర్తయ్యే నాటికి వచ్చిన ఆదాయంతో కుటుంబమంతా ఆరునెలల పాటు సంతోషంగా గడుపుతారు. తర్వాత కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు.

చిన్నపటి నుంచే శిక్షణ..

గంగిరెద్దులు విన్యాసాలు చేసే విధంగా వారు వాటికి చిన్నటి నుంచే ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ గంగిరెద్దులను నమ్ముకుని అనేక కుటుంబాలు పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ మండలంలో జీవనం సాగిస్తున్నాయి. తాతముత్తాతల నుంచి గంగిరెద్దులను ఆడించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మాకు ఎలాంటి ఆస్తులు లేవు. ఎవరైనా పెద్దవాళ్లు కాలం చేస్తే పదో రోజున ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని గంగిరెద్దులతో విన్యాసాలు చేయిస్తాము. సంక్రాంతి పండగ వచ్చిందంటే చుట్టుపక్కల గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పొట్టపోసుకుంటామని గంగిరెద్దుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గంగిరెద్దులపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

గంగిరెద్దులు ఆడిస్తేనే పూటగడిచేది



తాతముత్తాలనుంచి ఆచారంగా గంగిరెద్దులు ఆడించుంకుంటూ జీవనం సాగిస్తున్నాం. సంక్రాంతి పండగ మూడు, నాలుగు రోజులు మాత్రమే అంతోఇంతో ఆదాయం వస్తుంది. మిగిలిన రోజుల్లో సాయం చేసేవారు ఉండరు. దీంతో పూటగడవడం కష్టంగా మారింది.

– ఆవుల వెంకన్న, సాటివారిగూడెం

రేషన్ కార్డులు కూడా లేవు



గంగిరేద్దులే జీవనధారంగా ఉన్న గంగిరేద్దుల కుటుంబాలకు రేషన్‌కార్డులు, ఉండటానికి ఇళ్లులేక గ్రామాల శివారులో చెట్లకింద నివాసం ఉంటున్నాం. తెలంగాణ వచ్చిన తర్వాత మా తలరాతలు మారుతాయని అనుకుంటే పట్టించుకునే దిక్కులేదు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

– వీరన్న, రాజాపురం

ఆదరణ కరువైంది



ఇంతకు ముందు సంక్రాంతి పండగ వచ్చిందంటే గంగిరెద్దులను తీసుకుని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లితే ఆరునెలలకు సరిపడా తిండితిప్పలు దొరికేది. కరోనా తర్వాత ఆదరణ కరువైంది. ఎన్ని గ్రామాలు తిరిగినా గంగిరెద్దు పోషణకు కూడా సరిపోవడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మొర్రం రమేష్, చాతకొండ

క్లుప్తంగా

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ భాగ్యమ్మ

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామంలో ఉమ్మడి చల్లసముద్రం స్థాయి వాలీబాల్ పోటీలను గురువారం సర్పంచ్ చాట్ల భాగ్యమ్మ, తాటి చుక్కమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేషగిరి, తాటి భిక్షం, కోరం నగేష్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ప్రదీప్తి



జూలూరుపాడు: జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ (జీడీఎంఓ)గా డాక్టర్ కటకం ప్రదీప్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడెం జిల్లా ప్రధాన ఆస్పత్రి నుంచి డిప్యూటేషన్‌పై కాంట్రాక్ట్ పద్ధతిలో జూలూరుపాడు పీహెచ్‌సీకి డాక్టర్ ప్రదీప్తిని నియమించారు.

ఇఫ్టూ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

టేకులపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇఫ్టూ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి దుబాకుల ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆంజనేయపాలెం గ్రామంలో బద్దుతండా, కుంటల పంచాయతీల స్థాయిలో శుక్రవారం ముగ్గులు, తాడుగుంజడం పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఈ పోటీలను ప్రారంభిస్తారని, అనంతరం విజేతలకు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలలోపు హాజరై క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రియాంకగాంధీ పుట్టినరోజు వేడుకలు


టేకులపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. భూక్యా దేవా నాయక్, భూక్యా చంద్రకళ, వీసం శ్రీనివాస్‌రావు, రెడ్యానాయక్, భూక్యా రవీందర్‌సింగ్, బన్సీలాల్, రమణ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులు ఇంటిబాట


సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల వద్ద విద్యార్థుల సందడి

పాల్వంచరూరల్: సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో హాస్టల్, గురుకుల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు గురువారం ఇంటిబాట పట్టారు. 13 – 17వ తేదీ వరకు ఐదురోజులపాటు ప్రభుత్వం పాఠశాలలకు సంక్రాంతి పండగ సెలవులు ఇచ్చారు. సాంఘిక సంక్షేమ బాలిక, బాలుర గురుకుల పాఠశాలలు, కళాశాల, కిన్నెరసాని, ఉల్వనూరులోని బాలబాలికల గిరిజన విద్యార్థులు పుస్తకాలు, పెట్టెలు సర్దుకుని తల్లిదండ్రులతో కలిసి ఇంటికి తరలివెళ్లారు.

నాయకుల అరెస్ట్

చుంచుపల్లి: కేసీఆర్ కొత్తగూడెం పర్యటన నేపథ్యంలో గురువారం బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కొందరిని ఇంటికెళ్లి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఎం పర్యటన పేరుతో ఇలా అక్రమంగా బీజేపీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని పలువురు తప్పు పట్టారు.

సుజాతనగర్: సీఎం పర్యటన నేపథ్యంలో పలువురు కాంగ్రెస్ నేతలను గురువారం తెల్లవారుజామునే పోలీసులు ముందస్తుగా చేశారు. పోడుభూములకు పట్టాలు ఇవ్వకుండా వస్తున్న సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటామని నేతలు ప్రకటించిన నేపథ్యంలో నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఘనంగా బొమ్మల కొలువు


బొమ్మల కొలువు ప్రారంభించి మాట్లాడుతున్న మధురవాణి

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఆఫీసర్స్ క్లబ్‌లో బొమ్మల కొలువు నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి రిబ్బన్ కట్ చేసి బొమ్మల కొలువును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ల సతీమణులు పల్లవీ చంద్రశేఖర్, హరిణి సత్యనారాయణ, కొత్తగూడెం, మణుగూరు సేవా అధ్యక్షురాళ్లు వాణీ రమేష్, సునిత వెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు. మాట్లాడుతూ.. సంప్రదాయబద్ధంగా సందేశాత్మకంగా బొమ్మల కొలువులను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అనంతరం మహిళలు వేసిన రంగవల్లులను సంక్రాంతి పండుగ గంగిరెద్దుల సంప్రదాయం సెట్టింగ్‌లను తిలకించారు. ఈ సందర్భంగా మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో మహిళా క్లబ్ కార్యదర్శి హేమలత, సభ్యులు పాల్గొన్నారు.

మన సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం



ముగ్గుల పోటీలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తాయని, భిన్నత్వంలో ఏకత్వం చాటుతున్న పండుగలు ప్రజల మధ్య వ్యత్యాసాలను చెరిపివేస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సీపీఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బాబూ క్యాంపు, లక్ష్మీదేవిపల్లి, శేషగిరినగర్‌లో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంటూ తెలుగు సంద్రాయాలను కాపాడవలసిన అవసరం నేటితరం యువతీ, యువకులకు ఉందన్నారు. నైపుణ్యం ప్రదర్శించటానికి చక్కని వేదికగా ముగ్గుల పోటీలు నిలుస్తాయని, కుటుంబాల మధ్య స్నేహబంధం పెంపొందుతుందన్నారు. మహిళలు సమాజపోకడలపై అవగాహన పెంచుకొని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని మహిళా రక్షణ చట్టాల అమలు ప్రభుత్వ హామీల సాధనకోసం ఉద్యమాలపై అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. పాలక ప్రభుత్వాలు పదేపదే వల్లె వేస్తున్న మహిళా సాధికారత ఉపన్యాసాలకే పరిమితమవుతోందన్నారు. మహిళా చట్టాలు, హక్కుల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మహిళలు ఏకమై 33 శాతం రిజర్వేషన్, సాధికారత, చట్టాల అమలు కోసం ఐక్యంగా ఉద్యమించాలని, మహిళలను ఓటు బ్యాంకుగానే చూస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, దుర్గరాశి వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య రాష్ట్ర జిల్లా నాయకులు మున్నా లక్ష్మీకుమారి, ఏపూరి లతాదేవీ, కే.చంద్రకళ, వి.పద్మజా, కే.రత్నకుమారి, దుర్గరాశిలక్ష్మి, వాసిరెడ్డి మురళీ, గుండు శ్రీను, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కొమ్ము నృత్యాలతో సీఎంకు స్వాగతం


బీసీఎం రహదారి కలెక్టరేట్ వద్ద..


కోలాటం వేస్తున్న చిన్నారులు

పాల్వంచ: సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో లంబాడీ గిరిజన నృత్యాలు, కొమ్ము డ్యాన్సులు, కోలాటాలు, డప్పు వాయిద్యాలు కోలాహలంగా నిర్వహించారు. దారి పోడవునా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమక్షంలో నృత్యాలు, చప్పట్లతో ఆకట్టుకున్నారు. దారి పొడవునా పండుగ వాతావరణం నెలకొంది.

సీఎంకు టీఎన్‌జీఓ కమిటీ జ్ఞాపిక


మెమెంటో అందజేస్తున్న రాజేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీఓ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు గురువారం మెమెంటో అందజేశారు. ముఖ్యమంత్రి పరిపాలనా దక్షతను స్తుతిస్తూ మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్, జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, ప్రధాన కార్యదర్శి కంచర్ల సాయిభార్గవ్ చైతన్య, రాష్ట్ర, జిల్లా, డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

సూక్ష్మకళాకారుడు చారికి సీఎం ప్రశంసలు


సీఎం కేసీఆర్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న చంద్రమోహనాచారి

చుంచుపల్లి: చేతితో ఎన్నో అద్భుత సూక్ష్మకళా ఖండాలను సృష్టించి అవార్డులు దక్కించుకున్న సోము చంద్రమోహనాచారిని సీఎం కేసీఆర్ అభినందించారు. గురువారం కొత్తగూడెం పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్‌ని గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ సహాయంతో హెలీప్యాడ్ వద్ద చారి సీఎంను కలిశారు. ఈ సందర్భంగా చంద్రమోహనాచారి అభ్రకం పేపర్‌పై ప్రత్యేకంగా చిత్రీకరించిన కేసీఆర్ చిత్రపటాన్ని సీఎంకు బహూకరించారు. దాన్ని స్వీకరించిన సీఎం కేసీఆర్ చంద్రమోహనాచారిని ప్రశంసించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం


సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని హాస్టల్, పీఎంహెచ్‌లో పని చేస్తున్న వర్కర్లు సీఎం కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వేడుకున్నా కుదరదని తెగేసి చెప్పటంతో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో డెయిలీవేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్లు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ మాట్లాడుతూ.. డెయిలీవేజ్ వర్కర్లకు 8 నెలల వేతనాలు, అవుట్ సోర్సింగ్ వర్కర్లకు 22 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. పెంచిన పీఆర్‌సీ వేతనాలు అమలు చేయటం లేదన్నారు. పీఎఫ్‌లో ఉన్న అవకతకలను సరిచేయటం లేదని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, ఏడు నెలలుగా పలుమార్లు ఐటీడీఏ పీఓ, కమిషనర్, గిరిజన సంక్షేమశాఖ మంత్రిని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరినా పట్టించుకోవటం లేదని వాపోయారు. ఆందోళనలో సీఐటీయూ నేతలు, వర్కర్లు పద్మ, ముత్తయ్య, తాళ్లూరి కృష్ణ, ఈసం పద్మ, జయా, అంజమ్మ, సుబ్రహ్మణ్యం, సమ్మక్క, సుగుణ, సుశీల, లక్ష్మి, రాజమ్మ, రమ, రజిత, రమణి, జానకి, లక్ష్మణ్‌పాసీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి


నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పాల్వంచ: పట్టణంలోని అల్లూరి సెంటర్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర మాతృశక్తి సహ సంయోజక గానుగపాటి లక్ష్మీసరోజ మాట్లాడారు. వివేకానంద జీవితం నేటితరానికి ఆదర్శం అన్నారు. యువత వివేకానంద చూపిన మార్గంలో నడవాలని పేర్కొన్నారు. పౌరులు దేశానికి ఉపయోగపడే విధంగా తయారు కావాలన్నారు. గడిదేశి వెంకటేశ్వర్లు, నరేష్, చెంచాని శ్రీనివాసరావు, మధుసూధనా చారి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద 160వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'యువత –ప్రాధాన్యత'అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో సింగరేణి మహిళ్యా ఉపన్యాసకురాలు స్వప్న ప్రసంగించారు. దేశంలో యువశక్తి, మానవ వనరులు అధికంగా ఉన్నందున ప్రపంచ దేశాలు నేడు భారతదేశం వైపు చూస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, వైస్ ప్రిన్సిపల్ బిందుశ్రీ, శేఖర్, కిరణ్‌కుమార్, సురేంద్రకుమార్, సరిత, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పరాభవం తప్పదు..


ఇల్లెందు: అరెస్టులను నిరసిస్తున్న నాయకులు

ఇల్లెందు: జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను పోలీసులు ముందస్తు పేరుతో నిర్బంధించడం దుర్మార్గమని, రాజుల పాలనను తలపిస్తున్న కేసీఆర్ పాలన చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని ఎన్డీ రాష్ట్ర నాయకులు మధు ఆరోపించారు. గురువారం పోలీస్ స్టేషన్ నుంచి విడుదలైన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్డీ, ప్రజాపంథా, ఎన్డీ చంద్రన్న వర్గం, కాంగ్రెస్, తుడుందెబ్బ, ఏటీఎఫ్, టీటీఎఫ్ నేతలను అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు.

టేకులపల్లి: కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పాలనకు త్వరలోనే ముగింపు తప్పదని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ పాలనపై విసిగిపోయారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు లక్కినేని సురేందర్‌రావు, భూక్యా దళ్‌సింగ్‌నాయక్ అన్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ పర్యటనలో భాగంగా ముందస్తుగా పోలీసులు అరెస్టు చేయడంతో పోలీసుస్టేషన్‌లో నిరసన తెలియజేశారు. మాట్లాడుతూ.. ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడతారని దీమా వ్యక్తం చేశారు. అనంతరం పోలీసుస్టేషన్‌లోనే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు.

'గూడెం'లో ముగ్గుల పోటీలు


న్యూగొల్లగూడెంలో బహుమతులు అందజేస్తున్న రాజకుమారి

కొత్తగూడెంటౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కొత్తగూడెం పట్టణ పరిధిలోని పలుచోట్ల గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగవల్లులు అద్ది తమ ప్రతిభను చాటుకుని బహుమతులను గెలుచుకున్నారు. కొత్తగూడెం న్యూగొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో 16 వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్ పర్సన్ ఉపేందర్, ప్రధానోపాధ్యాయురాలు ఎస్కే జరీనా, ఉపాధ్యాయులు కాశీంపాషా, భ్రమరాంభ, చందన, లావణ్య, తల్లిదండ్రులు, వార్డు ప్రజలు, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి స్థానికులు పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ కొత్తగూడెం నగరశాఖ అధ్యక్షుడు వందనపు శ్రీధర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా కొత్తగూడెం భజన మందిరం రోడ్ శ్రీ వివేకానంద విద్యాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పోటీల్లో పాల్గొని రంగవల్లులు అద్దారు.

జేకే ఓసీలో డీడీఎంఎస్ పర్యటన

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) రాజీవ్ వర్మ పర్యటించారు. గురువారం ఓసీలో సబ్‌స్టేషన్, క్రషర్ ఏరియాను తనిఖీ చేశారు. సోలార్ ప్లాంట్‌ను సందర్శించి అధికారులతో చర్చించారు. రక్షణతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌లో చేపడుతున్న రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి పంజాల శ్రీనివాస్, ఏజీఎం (ఈఅండ్‌ఎం) ప్రభాకర్‌రావు, ప్రాజెక్టు అధికారి బొల్లం వెంకటేశ్వర్లు, గని మేనేజర్ పూర్ణచందర్‌రావు, ఇంజనీర్ చిన్నయ్య, డీవైఎస్ఈ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో మెకానికల్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేశారు. గురువారం సింగరేణి మెకానికల్ బృందం డీఎంఎస్ ఎస్‌జీ బైసారె, డీడీఎంఎస్ దిలీప్‌కుమార్ కేఓసీలోని పని ప్రదేశాలను తనిఖీ చేశారు.

గని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్‌వీఆర్ ప్రహ్లాద్, ఇల్లెందు ఏరియా ఇంజనీర్ జి.ప్రభాకర్, కేఓసీ ప్రాజెక్టు ఇంజనీర్ సీహెచ్.శివశంకర్, మేనేజర్ సౌరభ్‌సుమన్ పాల్గొన్నారు.

బహిరంగసభను జయప్రదం చేద్దాం


మాట్లాడుతున్న ఆంథోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, పక్కన రాములునాయక్ తదితరులు

జూలూరుపాడు: ఖమ్మంలో ఈనెల 18న జరగనున్న బీఆర్ఎస్ తొలి బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆంథోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పిలుపునిచ్చారు. వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అధ్యక్షతన గురువారం జూలూరుపాడు, ఏన్కూరు మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశాన్ని జూలూరుపాడులో నిర్వహించారు. క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బహిరంగ సభకు వేలాదిగా కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు కదిలిరావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాములునాయక్, రాష్ట్ర పాఠశాలల మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, లావుడ్యా సోనీ, భూక్యా కళావతి, యల్లంకి సత్యనారాయణ, ఎదళ్లపల్లి వీరభద్రం, పొన్నెకంటి సతీష్‌కుమార్, బానోత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జూలూరుపాడుకు వచ్చిన ఆంథోల్, వైరా ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, రాములునాయక్‌ను టీయూడబ్ల్యూజే(టీజేయూ) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కొలిపాక చంద్రశేఖర్‌తో పాటు గుండా సత్యనారాయణ, శ్రీనివాసరావు, బండ్ల వెంకటేశ్వర్లు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకుడు చంద్ర నరసింహారావు సన్మానించారు.

పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి వేడుకలు

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు, సంప్రదాయ దుస్తులతో ఆలరించారు. బోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. హరిదాసు, గంగిరెద్దుల మేళం, సంప్రదాయంతో కోలాహలం నెలకొంది. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్


జూలూరుపాడు: వినోభానగర్‌లో ముగ్గులు పోటీలు


పాల్వంచ: శ్రీవిద్య పాఠశాలలో...


సుజాతనగర్: శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్‌లో..


టేకులపల్లి: ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు


కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో...